కథ



# చీడకాటు

- వి.వెంకటరెడ్డి

**కరెంటు మోటర్ విష్ణుచక్రంలా గిర్రున తిరుగుతోంది. గలగలమంటూ గంగమ్మతల్లి ఉరకలు వేస్తూ వస్తోంది. కాలువ వెంట పరుగులు తీస్తోన్న జలధార - పాలిపోయిన పైరు బుగ్గలపై నిగ్గును తెస్తోంది.**

తుమ్మచెట్టు నీడన ముంగాళ్ళపై కూర్చుని ఉన్నాడు లచ్చిగాడు.

తడుస్తోన్న తన చేనుని తదేకంగా చూస్తోన్నాడు. తృప్తినిండిన వాడి కళ్ళల్లో పంచరంగుల స్వప్నం ...

'పంట గడపకాడ్కి వొచ్చి ఎన్రోజులైందో! నిరుడు కోతకొచ్చినాక పెద్ద వానలుపడి పంటంతా నీళ్లపాలాయె. అంతకు మునుపు అగ్గి తెగులు. దానికి ముందున తాలు ఇత్తనాల బాగోతం.

ఇప్పుడు - మొలకలేసినాక వానదేవునికి కొంచెమైనా కనికెరం ల్యాకపాయె. యాడా నల్లమోడం జాడల్యాక మొలకలెండిపోతాంటే, ఆపద మొక్కులోడిలక్క పెదకామందు ఆదుకున్నాడు. తన బాయిలోని నీళ్లను వాడుకొమ్మని పంపుసెట్టును ఇచ్చినాడు. ల్యాకుంటే ఈసారి కూడా అంతే! ఆ దొర పున్నెమాని పంట సేతకొస్తే, బిర్రు సేస్తోన్న అల్లునికి మిగులు కట్నం ఇచ్చేసి, అప్పులు తీర్చి ... ఏ అప్పులని తీరుస్తావ్? అంతరాత్మ హేళన చేయటంతో గతుక్కుమన్నాడు.

అంతవరకు రొదజేస్తూ తిరుగుతోన్న మోటర్ - హఠాత్తుగా మూగబోయింది. వస్తోన్న నీరూ ఆగిపోయింది వాడి పగటి కలలాగే. భ్రమల ముసుగులోంచి ఒక్కసారిగా తేరుకుని - మోటర్‌కేసి చూసి ఉలిక్కిపడ్డాడు.

సుళ్ళు తిరుగుతూ మోటార్‌లోంచి తెల్లని పొగ. ఏదో వైరు కాలుతోన్న వాసన లచ్చిగాడి ముక్కుపుటాలకు గుప్పున సోకింది. వెంటనే పరుగెత్తి స్విచ్ ఆఫ్ చేశాడు. ఒక్కో అడుగు బలహీనంగా వేస్తూ మోటర్ వద్దకు వచ్చాడు. గుండెలో దడ. ముఖమంతా చెమటలు. మోటర్‌పై చేతిని ఉంచబోయి ఎందుకో ఠక్కున ఆగిపోయాడు. మనసులో మోటర్‌కేదో జరిగిందన్న అనుమానం. ఎక్కడో తీతువుపిట్ట అరిచింది. వాడి భయం రెట్టింపయింది. కనుచూపు మేరలో గొర్రెలను కాస్తోన్న హనుమంతు గానిపాట ... వింటూనే లచ్చిగాడికి కాస్త ధైర్యమొచ్చింది. అయినా వణుకుతోన్న చేతిని మోటర్‌పై మెల్లగా ఉంచాడు.

అంతే ... కళ్ళకు నక్షత్రాలు కనిపించాయి. వంట్లో రక్తానికి బదులు కరెంటు ప్రవహిస్తున్నట్టు. మెరుపు తీగలా మెలికలు తిరిగాడు. ఒక్క ఊపున వెంటనే చేతిని వెనక్కు లాగేసుకుని - ఊపిరి తీసుకున్నాడు. శరీరం అచేతనమైనట్టు కాసేపటి వరకూ మనిషి కాలేకపోయాడు. వాడి కళ్ళకు మోటర్ ఒక భూతంలా కనిపించింది. వెంటనే అక్కడి నుండి కాళ్ళకు బుద్ధి చెప్పాడు.

***

లంకంత మేడ. అందులో చిన్న బల్బు భళ్ళున పగిలింది. వెంటనే జోగులు గాని గూబా పగిలింది.

''సేయి జారిందయా'' చెంపను నిమురుకుంటూ కంట తడి చేశాడు.

''జారుతుందిరా. ఈ నడుమ ఒల్లు బాగా కొవ్వెక్కింది. జీతంలో దీని డబ్బులు పట్టుకుంటే అప్పుడు తెలుస్తాది'' విసురుగా వరండాలోకి వచ్చి - దబ్బున మడత కుర్చీలో వాలాడు.

గతుకుల ముఖం. బుర్ర మీసాలు. నల్లని ఒళ్ళు. ఒంటిపై బంగారం తెల్లని బట్టల్లో కుదేసిన నిండు బస్తాలా ఉన్నాడు. అతని పేరు మీసాల ముత్యాలయ్య. అల్లంత దూరంలో బర్రెలపాలు పిండుతూ కేన్‌లకు హడావిడిగా పోస్తున్నారు పాలేర్లు. కంపచెట్ల కింద కోళ్ళు చెత్తనుగెలుకుతున్నాయి. ఏపుగా పెరిగిన చింతచెట్టు నీడలో పిల్లలు చిల్లగోడు అడుకుంటున్నారు.

అందులో కాస్త పెద్ద వాళ్ళుగా ఉన్న ఇద్దరు పిల్లలు దేనికో తగవుకు దిగారు. చివరకు చొక్కాలు పట్టుకుని బలాబలాలు తేల్చుకుంటున్నారు. చుట్టూ చేరిన అల్లరిమూక - చప్పట్లూ, ఈలలూ వేస్తూ వారిని మరింత ఉద్రేకపరుస్తూ ఆనందిస్తున్నారు. ఈ తతంగమంతా వినోదంగా వీక్షిస్తోన్న ముత్యాలయ్య ముందు హఠాత్తుగా వాలాడు లచ్చిగాడు.

మెడలో సొట్టలు పడ్డ ఆంజనేయుని బిళ్ళ. పెరిగిన గడ్డం. మాసిన బట్టల్లో ఎండు చేపలా ఉన్నాడు.

''... ఏరా లచ్చిగా సేను తడపడం అయిందా?'' చుట్టను వెలిగిస్తూ ప్రశ్నించాడు ముత్యాలయ్య.

''... నిన్నేరా. అంత బొసపెడ్తున్నావేం? ఏమైందసలు?'' ముఖం చిట్లిస్తూ మరోసారి రెట్టించి అడిగాడు.

పైన ఎండ మాడ్చేస్తోంది. కింద బండలూ మాడిపోతున్నాయి. అయినా బెదురు బెదురుగా నిల్చుని అవస్థలు పడుతూ - ''అయ్యా అది ... అది ...'' అని నసిగాడు.

''తొందరగా చెప్పయ్యా. అవతల పంచాయతి ఆఫీసు కాడ్కి పోవాల'' విసుక్కున్నాడు ముత్యాలయ్య.

కోపం అసహనం రెండూ ధ్వనించిన ముత్యాలయ్య కరుకు గొంతుకు ఈసారి లచ్చిగాడి నోటితాళం ఊడింది.

అంతే విసురుగా ముత్యాలయ్య నోట్లోని చుట్టకూడా నేలను తాకింది.

''దొంగ నాకొడకా. ఎంతపని సేసావురా! మోటర్ కాలగొట్టొచ్చి అది సెప్పడానికి నన్నింతసేపు ఇసిగిస్తావా. ఎంత దైర్యంరా నీకు'' ఆగ్రహంతో కళ్ళెర్ర చేశాడు.

ముత్యాలయ్య గట్టిగట్టిగా బూతులు రావడం విని - బుంగ లతో వెడుతోన్న ఇద్దరు ఇటు వచ్చారు. గేదెల చాటు నుంచి పాలేర్ల తలలూ తొంగి చూశాయి. పిల్లలందరూ గుమిగూడారు.

''ఎల్లు. వెంటనే ఎల్క్ట్రీషన్ని ఎంటేస్కురా బాగ సేయించు'' రంకేశాడు.

తుఫాన్‌లోంచి బయటపడ్డ జాలరిలా సన్నగా కంపిస్తూ అక్కడి నుంచి తప్పుకున్నాడు. దారి పొడవునా తల రాతను నిందించుకుంటూ ఎలక్ట్రీషియన్ ఇంటి తలుపును తట్టాడు. అతగాడు టౌనెళ్ళాడని తెలిసి ఉసూరుమన్నాడు. ఎవరో పక్కూరి ఎలక్ట్రీషియన్ అడ్రస్‌ను ఇస్తే ఉరుకులు పరుగులతో వెళ్ళి వెంటబెట్టుకొచ్చాడు.

✱✱✱

ఎలక్ట్రీషియన్ మోటర్‌ను చెక్ చేస్తోన్నాడు. అతని ప్రతి కదలికను కన్నార్పకుండా చూస్తోన్న లచ్చిగాడిలో టెన్షన్. మోటర్‌కే ప్రమాదం జరిగి ఉండకూడదని మనసులో దేవుళ్ళను ప్రార్థిస్తున్నాడు. వాడి మొర ఏ దేవుడు ఆలకించనట్టుగా ఎలక్ట్రీషియన్ చావు కబురు చల్లగా చెప్పాడు. మోటర్ వైండింగ్ పూర్తిగా కాలిపోయిందని, ఆ మాట వింటూనే లచ్చిగాడి ముఖం మాడిన బల్బయింది.




ఇంతలో ముత్యాలయ్య వచ్చాడు. నల్లగా మాడిపోయిన మోటర్ వైండింగ్ వెక్కిరించింది. గిర్రున లచ్చిగాడికేసి తిరిగాడు. ఒదిగిపోయి నిల్చున్నవాడు - ముత్యాలయ్య చూపులోని దావాగ్నిని భరించలేనట్టుగా మరింత కుంచించుకుపోయాడు.

''ఒరే, అయ్యో పాపమంటే ఆర్నెల్లకర్మ ఎంటాడినట్టు! బీదోడవని కనికెరం సూపిస్తే అసలుకే ఎసరు తీస్కొచ్చినావే. నా సేనుకు నీల్లెట్టుకోకుండా నీకిచ్చాను. సాయం సేసినందుకు మా బాగా బుద్ది సెప్పావు. మొన్ననే సంకరాత్రి నాడు దండిగ కర్సుసేసి బాగసెయిస్తే, ఇంతలోకే మల్లా రిపేరా! ఇంగనా సాతకాదు. నువ్వే ఆ పని సూడు'' అని తలపట్టుకున్నాడు.

పిడుగులా గర్జిస్తూ, పూనకం వచ్చిన వాడిలా చిందులు తొక్కి ముత్యాలయ్య - మెత్తగా మందలించడం చూసి - అసలు మర్మం తెలియని జనాలు అవాక్కయ్యారు.

''ఇదిగో ఎల్క్ట్రీషనూ! పొద్దు మూకుతోంది. అట్లా సొద్యం సూస్తూ ఉండకపోతే, మోటర్ రిపేరికి ఎంతయితాదో వాడికి సెప్పకూడదూ'' ఎల్క్ట్రీషియన్ని కదిపాడు ముత్యాలయ్య.

''అయ్యా ఇది టెన్ హెచ్‌పి మోటర్. బాగానే ఖర్చు వస్తుంది. 'స్టార్టర్' ఫెయిల్ అయినందువల్ల మోటర్ కాలిపోయింది. కాబట్టి స్టార్టర్ కూడా కొత్తది కొనాలి. అన్ని ఖర్చులు కలిపి షుమారుగా ఐదు వేల రూపాయలు అవుతాయి'' వేళ్ళపై లెక్కలేశాడు ఎలక్ట్రీషియన్

ఐదు ఎయిలు ... తల్చుకోగానే లచ్చిగాడి గుండెలో డైనమెట్లు పేలాయి. బలంగా ముఖాన్ని కెరటమొచ్చి గుద్ది వెళ్ళినట్టు ముత్యాలయ్య ముందు కుప్పలా కూలాడు.

''అయ్యయ్యా మీ కాళ్ళట్టుకుంటాను. ఈ బక్కోని సంగతి తమరికి తెల్సనిదేముంది. పూట గడ్పడమే సానా ఇబ్బందిగా ఉంటే, పులిమీద పుట్రలా ఇదోటి. ఎలాగోలా తమరే దయ సూపాల'' జాలిగా అర్థించాడు.



''బాగుందిరోయ్ నీ యవ్వారం. దయ సూపబట్టే మొదటికే మోసం తెచ్చావు. మోటర్ నీ పంచలో కాలిపోయింది. దాన్ని బాగా సేయించే బాధ్యత కూడా నీదే. నేనొక్క పైసా ఇయ్యను. ఏమి తిప్పలు పడతావో ఏమో! నాకు మాత్రం ఎంటనే మోటర్ బాగై పోవాల. ల్యాకుంటే ఉన్న ఆ కొంచెం బూమిని లాక్కుంటాను. అప్పుడెవడడ్డం వస్తాడో సూస్తా'' అంటూ తీక్షణంగా చుట్టూ చూశాడు.

ముత్యాలయ్య అంత ఖండితంగా శాసించే సరికి లచ్చిగోడు నీరు కారిపోయాడు. ఐనా ఆశచావక ముత్యాలయ్య కాళ్ళను మరింత గట్టిగా పెనవేసుకుని ''పోని అప్పుగా ఇచ్చయినా ఆదుకోండయా? పంట సేత కొస్తనే తమరి బాకీ ఎంటనే తీర్సేస్తాను'' దుఃఖ జీరతో బ్రతిమలాడాడు.

## సన్నీ రాక

నిన్నటిదాకా అజ్ఞాత వాసం చేసిన సన్నీడియోల్ మళ్లీ తెరపై కనిపించబోతు న్నాడు. 'గడర్'లో అమీషా సరసన జంటగా నటిస్తు న్నాడు. ఇన్నాళ్లూ తెరపై కనపించక పోవడానికి కారణం ఛాన్సు ల్లేక కాదు. పాపం వీపు నొప్పట. అది హీరోయిన్లను ఎత్తుకుని డ్యూయెట్లు పాడటం వల్లా? ఎందుకొచ్చిందో! ఇప్పుడు తగ్గిందట లెండి! అయినా డింపుల్ చాలా సింపులే కదా! అందువల్ల అయి ఉండదు!



పెళ్ళున నవ్వాడు ఆ మాటలకు ముత్యాలయ్య. ''ఒరే అప్పుల ఊబిలో ఇప్పటికే పీకల లోతుకు కూర్కపోయావు. దరిద్రం ఎంటాడుతోన్న నీకు అప్పిచ్చేదెవడ్రా పిచ్చోడు'' అంటూ ఎగతాళి చేసి లచ్చిగాడిని ఒక్క తోపు తోశాడు.

ఎండు పుల్లలా జనాల ముందుకొచ్చి పడ్డాడు లచ్చిగాడు. కుండ పోతగా సానుభూతిని కురిపిస్తోన్న జనాలకేసి దీనంగా - మీరైనా చెప్పి ఆదుకోండని రెండు చేతులను జోడించాడు. వాడి వేడుకోలులోని ఆవేదన, అభ్యర్థన తమను కాదన్నట్టు ఒక్కొక్కరే మెల్లగా జారుకున్నారు. అందరూ కనుమరుగైన వైపే చూస్తూ - ముఖాన్ని రెండు చేతుల్లో బాధగా దాచుకున్నాడు లచ్చిగాడు.

అప్పుకోసం అడ్డమైన వాళ్ళ కాళ్ళూ, గడ్డాలు పట్టుకున్నాడు. [illegible]డె ద్రవించలేదు. ఏ దేవుడు కరుణించలేదు. చివరకు భారంగా ఇంటివైపు నడిచాడు.

అల్లంత దూరంలోంచే మామ రాకను పోల్చుకుంది బతుకమ్మ. వాలిపోయిన తోటకూర కాడలా తన మామ ... ఆమె మనసు విలవిల్లాడింది.

''అయ్యాలే సెప్పా కదయ్యా. మోటర్‌ను తీస్కోమాకు, ఆడు అసలే మంచోడు కాదని. అయినా నా మాట ఇనలా. దేవుడన్నావు. నెత్తిమీద ఎట్టుకుని కొల్సాలన్నావు. సూడు ఇప్పుడేమయిందో. కొంచెం కూడా కనికెరం సూపకుండా బారమంతా నీమీన్నే ఏశాడు. ఎప్పటికైనా మనాంటోల్లు వానదేవున్నే నమ్ముకోవాల. ల్యాకుంటే మాడి సావాల'' అంటూ ఉక్రోషంతో సంటోడ్ని అనగబట్టి ముక్కును శుభ్రం చేసింది.

భార్య కంఠశోషకు మోకాళ్ళపై తల ఆన్చి కూర్చోన్న లచ్చిగాడు ఏమీ అనలేకపోయాడు. గత్యంతరం లేక తన చెవిపోగును, భార్య వంటిపైని నామమాత్రపు బంగారాన్ని అమ్మి - మోటర్‌ను బ్రతికించాడు.

✱✱✱

రిపేరీ చేయించిన మోటర్‌ను బిగిస్తోన్నాడు ఎలక్ట్రీషియన్. వారం రోజులుగా నీళ్ళు లేక ఎండిపోతున్న తన చేను, కూలి భరించలేక తన భార్య, పిల్లలు చెమటోడ్చి శ్రమించిన చేను అది. దాన్ని చూస్తోంటే గుండెను పిడికిట్లో వేసి పిండుతోన్నట్టుగా విలవిల్లాడాడు లచ్చిగాడు.

''ఒరే లచ్చిగా, సాటి వాడివని సాయం సేద్దామనుకున్నాను. ఇప్పుడైనా మించి పోయిందేముందిలే. ముందు నా సేను సంగతి సూసాక కావలిస్తే నీ సేను సూద్దాం. ముందా మోటర్‌ను ఇక్కడికెల్లి బిగించవయ్యా ఎలక్ట్రీషనూ'' జారిన కండువాను భుజంపైకి వేసుకుంటూ అన్నాడు.

గుండె జల్లుమంది లచ్చిగాడికి ముత్యాలయ్య మాటలు విని. 'ఇప్పుడు గాని నీలెట్టకపోతే పంట సేతికిరాదు. మళ్లీ మోటర్‌కు ఏమన్నా అయితే ...! నీరు సరిగ్గా రిపేరీ సేయించుక రాలేదని నెత్తిపై రుద్దితే ...! మళ్ళీ రిపేరీ సేయించాల్సి వస్తే ...!' లచ్చిగాడి భయాలతో తనకు పనిలేనట్టు ఎలక్ట్రీషియన్ మోటర్‌ను ఆడించి వెళ్ళిపోయాడు. లచ్చిగాడూ నిర్లిప్తంగా నాలుగడుగులు వేశాడు.

ఇంతలో పాత ఎలక్ట్రీషియన్ ఎదురుపడ్డాడు. ''ఏం ముత్యాలయ్య మామా మోటర్ కాలిపోయిందని కబురెట్టావట కదా! అప్పుడే చెప్పా కదా మామ. 'స్టార్టర్' పనైపోయింది. వెంటనే కొత్తది మార్చు లేకుంటే ఎక్కువ కరెంటొచ్చి మోటర్ కాలిపోతుందని'' వస్తూనే గడగడ మాట్లాడబోయాడు.

తలవంచుకుని నడుస్తోన్న లచ్చిగాడు - తన ఊరి ఎలక్ట్రీషియన్ మాటలకు ఉలిక్కిపడి - చివ్వున వెనక్కు చూశాడు.

అప్పటికే ముత్యాలయ్య కనుసైగ నందుకున్న ఎలక్ట్రీషియన్ ఠక్కున నోరు మూసుకున్నాడు.

అడగకముందే సాయమందించిన ముత్యాలయ్య అసలు ఆంతర్యం అర్థమయ్యేసరికి, లచ్చిగాడి కళ్ళు బైర్లు కమ్మాయి. నిస్సహాయంగా ముత్యాలయ్య వైపే చూస్తూ దబ్బున నేలకూలాడు.